సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఆదివారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు ఎన్నికల ప్రచార రథంపై హాజరవుతున్న బీఆర్ఎస్ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్‌కు జేజేలు పలుకుతున్న ప్రజలు.. వారికి అభివాదం చేస్తున్న కేసీఆర్

ప్రజలు గెలవాలి.. ప్రగతి సాగాలి

అభివృద్ధిని చూసి ఆశీర్వదించాలి ● ప్రజలందరి సహకారంతో తెలంగాణను నంబర్‌వన్ చేశాం: సీఎం కేసీఆర్

- కాంగ్రెస్‌కు 10 చాన్స్‌లు ఇస్తే ప్రజలకు చేసిందేముంది?
- 60 ఏండ్ల కిందే దళితబంధు ఉంటే పేదరికం ఉండేదా?
- మిషన్ భగీరథ ప్రపంచంలోనే లేదు
- మళ్లీ సీఎం హోదాలో వస్తా
- హుస్నాబాద్ సభలో సీఎం కేసీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ): 'తెలంగాణ ఒకప్పుడు ఎట్లున్నది.. ఇప్పుడు ఎలా మారిందో గుర్తు చేసుకోవాలి. అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌ను ఆశీర్వదించాలి' అని ప్రజలను సీఎం కేసీఆర్ కోరారు. స్పష్టమైన విధానంతో, అవగాహనతో ఓటింగ్ జరిగినప్పుడే ప్రజలు గెలుస్తారని, ప్రజల కోరికలు నెరవేరుతాయని చెప్పారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఆదివారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి వొడితల సతీశ్‌కుమార్‌కు బీఫారం అందజేశారు. 'సభ సాక్షిగా, మీ అందరి సాక్షిగా సతీశ్‌కు బీఫారం అందిస్తున్నాను. మీ బిడ్డగా దీవించండి' అని ప్రజలను కోరారు. అనంతరం ప్రసంగిస్తూ.. 2018 లో అసెంబ్లీ ఎన్నికల మొదటి సభను హుస్నాబాద్‌లోనే నిర్వహించినట్టు గుర్తు చేశారు. 'హుస్నాబాద్ గడ్డ ఆశీర్వాదంతో ఆనాడు నాలుగింట మూడు వంతులు.. అంటే 88 సీట్లతో అఖండ విజయాన్ని సాధించినం. ఈసారి కూడా మళ్లీ హుస్నాబాద్ నుంచే జైత్రయాత్ర ప్రారంభించాలని పెద్దలు సూచించారు. అందుకే ఈ రోజు హైదరాబాద్‌లో అభ్యర్థులకు బీ ఫారాలు అందజేసి, మ్యానిఫెస్టో ప్రకటించి, మీ దర్శనానికి ఇక్కడికి వచ్చాను' అని చెప్పారు.

హుస్నాబాద్ ప్రజా ఆశీర్వాద సభలో కెప్టెన్ లక్ష్మీకాంతారావును పలుకరిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో ఎంపీ కే కేశవరావు

రౌతేందో.. రత్నమేందో గుర్తించాలె

తాను చెప్పే విషయాలను విని వదిలేయకుండా ఇంట్లో, బస్తీలో, గ్రామంలో, తండాల్లో చర్చించాలని ప్రజలను కేసీఆర్ కోరారు. 'ఎన్నికలు చాలా వస్తయి, చాలా పోతయి, ఎవరో ఒకరు గెలుస్తుంటరు. ఎన్నికలు రాంగనే ఆగమాగం కావొద్దు. రౌతేందో.. రత్నమేందో ఆలోచించాలె. మనకు పనికొచ్చేదేందో గుర్తు వట్టాలె' అని అన్నారు. ఎవరో చెప్పారని ఓట్లు వేయొద్దని, ఓటు మన తలరాతను మారుస్తుందని చెప్పారు. మన గ్రామం, మన మండలం, మన జిల్లా, మన రాష్ట్ర తలరాతను మార్చే శక్తి ఓటుకు ఉన్నదని అన్నారు.

10 చాన్స్‌లిస్తే ఏం చేశారు?

'ఎన్నికలు రాంగనే కొందరు ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతరు. అలవిగాని హామీలు ఇస్తరు. ఆపద మొక్కులు మొక్కుతరు. తీర్థం పోదాంపా తిమ్మక్క అంటే నేను గుళ్లె, నేను సల్లె అన్నట్టుగా.. యాడికి తీసుకపోతరో తెల్వదు' అని కేసీఆర్ ఎద్దేవా చేశారు. కొన్ని పార్టీలు వచ్చి ఒక్క చాన్స్ ఇవ్వాలని అడుగుతున్నాయని మండిపడ్డారు. 'ఒక్క చాన్స్ ఎందుకు నాయనా ప్రజలు మీకు 10 చాన్సులు ఇచ్చారు కదా.. 60 ఏండ్లు మీరే రాజ్యం ఎలుగవెట్టిరు కదా. చేసిందేమిటి?' అని ప్రశ్నించారు. 75 ఏండ్ల స్వతంత్ర భారతావనిలో దళితులు ఇంకా పేదరికంలో మగ్గుతున్నారంటే అందరం బాధపడాలని, దేశం మొత్తం సిగ్గుతో తలదించుకోవాలని అన్నారు. ఒకవేళ 60-70 ఏండ్ల కిందటే దళితబంధులాంటి పథకం పెట్టి ఉంటే, ఇప్పుడు దళితుల్లో ఎందుకు పేదరికం ఉండేదో ఆలోచించాలని తెలిపారు. ఈ విధాన లోపం ఎవరిదని ప్రశ్నించారు. 50 ఏండ్లు రాజ్యం చేసి, ఇప్పుడు మల్లా ఓట్లడిగేటోళ్లు పాలించిన జమానాలో కరెంటు పరిస్థితి ఎట్లా ఉండేదో గుర్తు చేసుకోవాలని అన్నారు.

> తెలంగాణలో ఇప్పుడు రైతుకు తెల్లందాక కరెంటు పెట్టబోయే బాధ లేదు. ఇప్పుడు కంటి నిండా నిద్ర.. కడుపు నిండా కరెంటు .. కల్లాల నిండా వడ్లు. రెండు నెలలు వందల లారీలు పెట్టి గుంజినా తరగని వడ్లు. కల్లాలు ఒడుస్తలేవు. ఏ గ్రామంలో చూసినా, ఏ తారు రోడ్డులో చూసినా ధాన్యపు రాశులతో నిండిపోయాయి. వాటిని చూస్తే లక్ష్మీదేవి నాట్యం చేస్తున్నట్టుగా ఉన్నది. ఇవన్నీ ఊరికే రాలేదు.. వాటి వెనుక ఎంతో కృషి ఉన్నది.
>
> -సీఎం కేసీఆర్

వారిని ఆదుకొనే బాధ్యత సమాజానిదే

గతంలో పింఛన్ రూ.40, రూ.70 చివరగా రూ.200 ఇచ్చారని కేసీఆర్ గుర్తు చేశారు. తాను సీఎం అయిన తర్వాత 'ఎందుకు పెన్షన్ ఇవ్వాలి?. దానికి ఏమన్నా ప్రత్యేక కారణం ఉన్నదా? ఓట్ల కోసం మాత్రమే ఇస్తున్నామా?' అని అధికారులను అడిగానని చెప్పారు. అప్పుడు తేలిందేమిటంటే.. దురదృష్టవశాత్తూ మానవ సమాజంలో కొందరు విధివంచితులు ఉంటారని, వారిని డెస్టిట్యూట్స్ అంటారని అన్నారు. దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, పిల్లలు సరిగా చూడని వృద్ధులు ఉంటారని, ఏ రోజుకైనా వాళ్లందరినీ ఆదుకోవాల్సిన బాధ్యత సమాజానిదేనని స్పష్టం చేశారు. అందుకే పింఛన్ పెంచాలని నిర్ణయించినట్టు చెప్పారు. మానవీయ కోణంలో ఒకేసారి పింఛన్‌ను రూ.వెయ్యికి పెంచామని చెప్పారు. తొలివిడత పూర్తయ్యేసరికి రూ.2 వేలకు తీసుకుపోయామని గుర్తుచేశారు. ఇప్పుడు రూ.5 వేలకు పెంచబోతున్నట్టు చెప్పారు. ఓట్ల కోసం ఒకే రోజులో రూ.5 వేలకు పెంచుతామని చెప్పలేదని, మొదట రూ.3 వేలకు పెంచి తర్వాత ఏటా రూ.500 పెంచుతూ ఐదేండ్లు ముగిసేనాటికి రూ.ఐదు వేల పెన్షన్ ఇస్తామని తెలిపారు. రైతుబంధు పెట్టాలని తనను ఎవరూ అడగలేదని, ఎవరూ డిమాండ్ చేయలేదని చెప్పారు. ఇప్పుడు రూ.10 వేలు ఇస్తున్నామని, దాన్ని ఇంకా పెంచుతున్నామని చెప్పారు.

హుస్నాబాద్ అద్భుతంగా మారింది

ఒకప్పుడు హుస్నాబాద్‌కు హెలికాప్టర్‌లో వస్తుంటే కండ్లల్లో నీళ్లు వచ్చేవని సీఎం కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. తాను సిద్దిపేట ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కుండల్లో నీళ్లు తీసుకుపోయి తోటలో మొక్కలు కాపాడుకున్న ఘటనలను చూశానని చెప్పారు. ఇప్పుడు హెలికాప్టర్ నుంచి చూస్తే హుస్నాబాద్ వాగుమీద రెండుమూడు చెక్‌డ్యాంలు వరుసగా కనిపిస్తున్నాయని, రెండిట్లో నీళ్లు ఉన్నాయని తెలిపారు. కనుచూపు మేర పచ్చని పంటపొలాలు దర్శనమిస్తున్నాయని చెప్పారు. హుస్నాబాద్‌కు అటు దేవాదుల, ఇటు తోటపల్లి బరాజ్ నుంచి నీళ్లు వస్తున్నాయని, 1.10 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చే గౌరవెల్లి ప్రాజెక్టును దాదాపు పూర్తి చేసుకున్నామని చెప్పారు. ఎలక్షన్ తర్వాత 6 నెలలు కష్టపడితే లక్ష ఎకరాలకు నీళ్లు ఇవ్వొచ్చని తెలిపారు. 'ఇక్కడ ఓట్ల కోసం ఒక్క చాన్స్ ఇవ్వమని అడిగేందుకు వస్తున్నారు.. మోసకపోకండి. ఆ పెద్దలు ఇక్కడ చాలా వెలగబెట్టారు. మహా సముద్రం గండిని ఆగంబట్టించారు. దాని గురించి నాడు బీసీ వెల్ఫేర్ మినిస్టర్‌గా ఉన్న కెప్టెన్ లక్ష్మీకాంతారావు నాకు చెప్పారు. ఇదొక్కటి పూర్తి చేస్తే 10-12 ఊళ్లకు మేలైతది, భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. అప్పుడు చేస్తానని మాటిచ్చా. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మిత్రుడు కవ్వా లక్ష్మారెడ్డి, లక్ష్మీకాంతరావు, సతీశ్‌తో కలిసి మహాసముద్రం గండి పనులన్నీ పూర్తి చేశాం. 12 ఊర్లలో నీటి ఊటలు పెరిగినయ్' అని పేర్కొన్నారు.

> బామ్మర్ది చెప్పిండనో, మేనమామ చెప్పిండనో, సుట్టం చెప్పిండనో ఓట్లు వేయొద్దు. ఆ పద్ధతి బంద్ కావాలి. కచ్చితంగా ఆలోచించి, స్పష్టమైన విధానంతో, స్పష్టమైన అవగాహనతో ఓటింగ్ జరిగినప్పుడు తప్పకుండా ప్రజలు గెలుస్తారు. ప్రజల కోరికలు నెరవేరుతాయి.
>
> -సీఎం కేసీఆర్

మళ్లీ ముఖ్యమంత్రి హోదాలో వస్తా

చిగురుమామిడి మండలం ఒకప్పుడు కరువు ప్రాంతంగా ఉండేదని ఇప్పుడు మిడ్ మానేరు నీళ్లతో పచ్చని ప్రాంతంగా మార్చామని సీఎం కేసీఆర్ చెప్పారు. గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసే బాధ్యత తనదేనని అన్నారు. 'ఎన్నికలు అయిపోయిన ఐదారు నెలల్లో దాన్ని పూర్తి చేసి, దాని నుంచి నీళ్లు విడుదల చేయడానికి నేనే సీఎం హోదాలో మళ్లీ వస్తా' అని చెప్పారు. శనిగరం ప్రాజెక్టు కాలువ పూర్తవుతుందని, కొత్తకొండ వీరభద్రుడి ఆలయాన్ని బాగు చేసే బాధ్యత కూడా తానే తీసుకుంటానని చెప్పారు. సిద్దిపేట-ఎల్కతుర్తి జాతీయ రహదారిగా మార్చే అంశాన్ని పరిశీలిస్తామని అన్నారు.

బందెతో ఆడబిడ్డ కనిపిస్తే రాజీనామా చేయమన్నా!

ప్రపంచంలో మిషన్ భగీరథలాంటి పథకం ఎక్కడా లేదని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. నీళ్లు ఎక్కడి నుంచి ఇంటికి వస్తున్నయో ఎవరికీ తెలియదని, ఎక్కడా గొయ్యిలు, మోటర్లు, పంపులు లేవని పేర్కొన్నారు. ఏ ఊర్లో ఏ లెవల్ ఎంతున్నదో కొలిచి పైపులైన్లు వేశామని, దీంతో నేరుగా వచ్చి నీళ్లు ట్యాంకులో పడుతున్నాయని తెలిపారు. 'ఎక్కడైనా ఆడబిడ్డ బిందె పట్టుకొని రోడ్డెక్కితే వెంటనే ఆ ఎమ్మెల్యే రాజీనామా చేయాలని ఆ నాడు చెప్పిన. అంతలా శపథం తీసుకున్నా. నాడు ఎమ్మెల్యేలు, అధికారులు, మంత్రులు అందరు కలిసి పని చేస్తే.. నేడు మనం మిషన్ భగీరథ నీళ్లు తాగుతున్నాం' అని పేర్కొన్నారు.

హుస్నాబాద్ గెలుపే నాంది కావాలి

హుస్నాబాద్ గెలుపే రేపు 95-105 సీట్ల మధ్య బీఆర్ఎస్ గెలువడానికి నాంది కావాలని సీఎం కేసీఆర్ ఆకాంక్షించారు. 'ఈ తొలి బహిరంగ సభలో నేను మీ ఆశీర్వాదం కోరుతున్నాను. దీవించండి. బ్రహ్మాండమైన మ్యానిఫెస్టోను విడుదల చేసినం. కార్యకర్తలు, జడ్పీటీ సీలు, ఎంపీపీలు, మున్సిపల్ చైర్మన్, సర్పంచులు అందరూ బాధ్యత తీసుకోండి. మ్యానిఫెస్టోను ప్రతి ఇంటికీ పంచి పెట్టండి' అని సూచించారు. హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్ చాలా మంచి ఎమ్మెల్యే అని, అందరి తలలో నాలుకలా ఉంటాడని చెప్పారు. 'మీ సేవకోసం బ్రహ్మాండంగా పనిచేస్తున్నాడు. ఇటువంటివారు చాలా తక్కువగా ఉంటారు. ఆయన సేవలు వినియోగించుకునేందుకు భారీ మెజార్టీతో ఒడితల సతీశ్‌కుమార్‌ను గెలిపించాలి' అని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

తాటిచెట్లు ఎక్కి బీఆర్ఎస్ పార్టీకి సంఘీభావాన్ని ప్రకటిస్తున్న గీత కార్మికులు

ప్రజాఆశీర్వాద సభ గ్రాండ్ సక్సెస్

అనుకున్న లక్ష్యాన్ని మించి వచ్చిన జనం ● బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం

సిద్దిపేట, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ తొలి ఎన్నికల 'ప్రజా ఆశ్వీరాద' సభ గ్రాండ్ సక్సెస్ అయ్యింది. అనుకున్న లక్ష్యానికి మంచి ప్రజలు తరలిరావడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో నూతనోత్తేజం కనిపించింది. సభా ప్రాంగానికి ఎదురుగా ఉన్న తాటిచెట్లు ఎక్కి గీత కార్మికులు బీఆర్ఎస్ పార్టీకి సంఘీభావాన్ని తెలిపారు. వారికి సీఎం కేసీఆర్ కృతజ్ఞతలు తెలిపారు. సభ సాయంత్రం 4 గంటలకు ఉండగా, మధ్యాహ్నం 2 నుంచే జనం తండోపతండాలుగా తరలివచ్చారు. పట్టణంలోని రోడ్లన్నీ కిక్కిరిసి పోయాయి. సీఎం కేసీఆర్ సాయంత్రం 4.34 గంటలకు హెలికాప్టర్‌లో హుస్నాబాద్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి 4.45 గంటలకు ఎన్నికల ప్రచార రథంలో సభాస్థలికి చేరుకున్నారు. కేసీఆర్ చేరుకోగానే సభ ప్రాంగణం కేరింతలతో దద్దరిల్లింది. ప్రజలనుద్దేశించి 21 నిమిషాల పాటు కేసీఆర్ ప్రసంగించారు. అనంతరం ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్‌కు బీఫాం అందజేశారు. హైదరాబాద్‌లో ఇవ్వలేదని, ఈ సభసాక్షిగా ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌కు బీఫారం అందజేస్తున్నానని కేసీఆర్ చెప్పగానే ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తంచేశారు.

మెరిసిన రథం.. మురిసిన జనం

బీఆర్ఎస్‌కు కలర్‌ఫుల్ ప్రచార రథం ● అత్యాధునిక హంగులతో కనువిందు

హుస్నాబాద్‌లో ప్రచార బస్సులో నుంచే కేసీఆర్ పూరించిన శంఖారావం

హైదరాబాద్, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ఎన్నికల ప్రధాన ప్రచార రథం అత్యాధునిక హంగులతో ప్రజలను ఆకట్టుకుంటున్నది. పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఈ బస్సు నుంచే రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం నిర్వహించనున్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో ఆదివారం ఈ బస్సు నుంచే కేసీఆర్ ఎన్నికల శంఖారారాన్ని పూరించారు. కనువిందైన గులాబీ రంగు.. దానిపై కారు గుర్తు.. భారతదేశ పటం, బీఆర్ఎస్ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ నిలువెత్తు రూపంతో అత్యాధునిక ఆకర్షణీయ బస్సు తెలంగాణ అంతటా కలియ దిరుగనున్నది. ఎన్నికల ప్రచారం కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఈ బస్సును సమాజ్‌వాదీ పార్టీ అధినేత, ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం అఖిలేశ్‌యాదవ్ బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్‌కు నజరానా ఇచ్చారు. ప్రతి ఇంటికి సంక్షేమం, ప్రతి ముఖంలో సంతోషం... ఓట్ ఫర్ కార్.. ఓట్ బీఆర్ఎస్, మన రాష్ట్రంలో మన పార్టీ.. మన ఓటు మన కారు గుర్తుకే' వంటి నినాదాలు.. విధానాలతో అత్యంత ఆకర్షణీయంగా బస్సు ముస్తాబై కనువిందు చేస్తున్నది. లోపల ఎంతదూరం ప్రయాణం చేసినా బడలిక లేకుండా ఉండేందుకు కావాల్సిన అన్ని సౌకర్యాలు, హంగులతో బస్సును ప్రత్యేకంగా రూపొందించారు. హైడ్రాలిక్ ఎలివేటర్ (బస్సు లోపలి నుంచి పైకప్పుపైకి వెళ్లేందుకు అనువుగా), బస్సుకు ఇరువైపులా హై క్వాలిటీ సౌండ్ సిస్టమ్, లోపల టీవీ, వైఫై సహా అత్యాధునిక సాంకేతిక సదుపాయాలతో మెర్సిడెస్ బెంజ్ బస్సు సీఎం కేసీఆర్ నిర్వహించే ఎన్నికల ప్రచారంలో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల రోడ్ల మీద తిరుగుతూ కనువిందు చేయనున్నది.

100 స్థానాలు సాధిస్తాం

మన మ్యానిఫెస్టోతో ప్రతిపక్ష నాయకులకు వణుకు

- సీఎం కేసీఆర్ మాట ఇస్తే తప్పరని ప్రజలకు నమ్మకం
- సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే సతీశ్‌కు హ్యాట్రిక్ గెలుపు ఇవ్వాలి
- హుస్నాబాద్ ప్రజా ఆశీర్వాద సభలో మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట/హుస్నాబాద్, అక్టోబర్ 15(నమస్తే తెలంగాణ ప్రతినిధి): 'గత శాసనసభ ఎన్నికల్లో సీఎం కేసీఆర్ హుస్నాబాద్ గడ్డ నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఆ ఎన్నికల్లో మనకు 88 అసెంబ్లీ స్థానాలు వచ్చాయి. మళ్లీ హుస్నాబాద్ గడ్డ నుంచే ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈసారి 100 స్థానాలను సాధిస్తాం' అని ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో మంత్రి హరీశ్‌రావు మాట్లాడారు. ఎల్లమ్మ తల్లి దయతో తప్పకుండా ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ వంద సీట్లతో హ్యాట్రిక్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టోను చూసి తెలంగాణ ప్రజల హృదయాలు ఉప్పొంగిపోతుంటే.. ప్రతిపక్షాల గుండెలు మాత్రం వణికిపోతున్నాయని చెప్పారు. సీఎం కేసీఆర్ ఏ మాట ఇచ్చినా తప్పకుండా దానిని అమలు చేస్తారనే నమ్మకం తెలంగాణ ప్రజల్లో బలంగా ఉందని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో హుస్నాబాద్ కరువు ప్రాంతమని, స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ సహకారంతో పచ్చటి పొలాలతో అలరారుతున్నదని పేర్కొన్నారు. సతీశ్‌కుమార్ సౌమ్యుడు, ప్రజల మనిషి, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించే మచ్చలేని నాయకుడని మంత్రి చెప్పారు. ఇక్కడ సతీశ్‌కుమార్‌కు, అక్కడ సీఎం కేసీఆర్‌కు హ్యాట్రిక్ విజయం అందించే విధంగా ప్రజల తీర్పు ఉండాలని కోరారు.

చెప్పనిది కూడా సీఎంచేస్తారు: వినోద్

చెప్పింది చేయడంతోపాటు చెప్పనిది కూడా చేసి చూపించడం బీఆర్ఎస్ పార్టీ, సీఎం కేసీఆర్ విధానమని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. ఎన్నికల్లో చెప్పని రైతుబంధు, రైతు బీమా, కల్యాణలక్ష్మి లాంటి పథకాల అమలే అందుకు నిదర్శనమని చెప్పారు. అభివృద్ధిని కొనసాగించాలంటే మూడోసారి బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని కోరారు.

హుస్నాబాద్ సస్యశ్యామలం: సతీశ్

2014కు ముందు కరువు, కాటకాలతో ఉన్న హుస్నాబాద్.. నేడు సీఎం కేసీఆర్ కృషితో సస్యశ్యామలంగా మారిందని బీఆర్ఎస్ అభ్యర్థి వొడితల సతీశ్‌కుమార్ చెప్పారు. హుస్నాబాద్‌కు ఏది అడిగినా కేసీఆర్ కాదనకుండా ఇచ్చిన గొప్ప నేతలని కొనియాడారు.

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఆదివారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభ ప్రాంగణం పూర్తిగా నిండిపోవడంతో రోడ్డుపై నిలబడి సీఎం ప్రసంగాన్ని ఆసక్తిగా వింటున్న ప్రజలు